W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
4-7-2025

## ఖమ్మంలో భూ మాఫియాకు చెక్!

ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగు గ్రామంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదిపేసిన ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. నకిలీ హక్కుల పేరుతో వేల కోట్ల విలువైన భూములు కొన్ని వ్యక్తుల కబ్జాలోకి వెళ్లిన నేపథ్యంలో, అధికారులు సమయోచితంగా స్పందించి మళ్లీ ప్రభుత్వ హక్కును సాధించగలగడం అనేది అభినందనీయం.


08

## ఖమ్మం నగరానికి ధీటుగా కూసుమంచి హెడ్ క్వార్టర్ అభివృద్ధి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి


05

నగరాలకు ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసు మంచి మండలంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం కూసుమంచిలో పర్యటించి పలు రోడ్ల నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు.


06

## విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి!

### పీడీఎస్‌యూ నేతల అరెస్టు

ఖమ్మంలో విద్యార్థి సమస్యలు మరింత ముదిరిపోతున్న నేపథ్యంలో పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా, విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనే ఆవేదనతో ఈ ఆందోళనకు విద్యార్థులు సిద్ధమయ్యారు.




## ఏదులాపురం మున్సిపాలిటీకి నూతన రూపం

### 12 పంచాయతీలు.. 32 వార్డుల విభజన

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు గతంలో పల్లె పరిపాలనలో ఉన్న 12 పంచాయతీలను ఒక??? చేసి ఏదులాపురం మున్సిపాలిటీగా గుర్తింపు లభించింది. ఈ మేరకు జీవో నెంబర్ 122 ద్వారా అధికారికంగా మున్సిపాలిటీ ఏర్పాటు కాగా, కొత్తగా 32 వార్డులు ఏర్పాటు చేసి, వాటి జాబితాను మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటించారు.

### 70వేలు దాటిన జనభా

ప్రతి వార్డుకు సుమారు 1,500 ఓట్లు ఉండేలా ప్రణాళిక ప్రకారం విభజన చేపట్టినట్టు తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 44,600 గా ఉండగా, అధికారిక జనాభా లెక్కల ప్రకారం 2011లో ఈ ప్రాంత జనాభా 35,210గా ఉండగా, ప్రస్తుతం అది 70 వేల దాటినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### నిపుణుల బృందం

ప్రతీ వార్డుకు ఒకో వార్డు ఆఫీసర్, సిబ్బంది నియామకం జరగనుందని, మున్సిపల్ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, నిపుణ సిబ్బంది అందుబాటులోకి తేవాలని కమిషనర్ వెల్లడించారు. అంతేకాక, చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనుల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ అభివృద్ధి చర్యలతో ఏదులాపురం పరిసర గ్రామాలకు పట్టణ రూపు కలగబోతుండగా, ప్రజల జీవితాల్లో కొత్త శకానికి నాంది పలికినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు

# వరద ఉధృతి అంచనాలను సమర్ధవంతంగా అందించాలి

**ఖమ్మం,మహా:** వరద ఉధృతి అంచనాలను సమర్ధవంతంగా అందించాలని, ఆ దిశగా పటిష్ట వ్యవస్థను జిల్లాలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి విపత్తుల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విపత్తుల గురించి మనకు ఎంత త్వరగా తెలిస్తే అంత త్వరగా ప్రజల సంరక్షణకు చర్యలు తీసుకోవచ్చని అన్నారు. వరద అంచనా వ్యవస్థ కట్టుదిట్టంగా పని చేయాలని, నీటి వనరుల్లో నీటి నిల్వలు, పైన ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాలలో కురిసే వర్షాలు, వస్తున్న వరద వివరాలను నీటి పారుదల శాఖ అధికారులు రెగ్యులర్ గా మానిటర్ చేయాలని అన్నారు. భద్రాచలంలో వరద ఉధృతి సంబంధించి పకడ్బందీ వ్యవస్థ ఉందని, భద్రాచలం వద్ద వరద వివరాలు ప్రతి గంటకు తెలుస్తాయని, ఆ దిశగా ఖమ్మం జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వరద ఉధృతి ఎప్పటికప్పుడు సమర్ధవంతంగా అంచనా వేయాలని అన్నారు. తీర్థాల, మున్నేరు, ఆకేరు, తదితర వాటి వద్ద నీటి ప్రవాహం, నీటి నిల్వ ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని అన్నారు. జిల్లాలో అవసరమైన చోట వాటర్ గేజ్ ఏర్పాటు చేయాలని అన్నారు. గత వరదలను దృష్టిలో ఉంచుకొని మన జిల్లాకు వరద ఎంత వస్తుంది అనే సమాచారం ముందుగానే అందేలా చూడాలని, దీనికి సంబంధించి బాధ్యతలను నీటిపారుదల శాఖకు అప్పగిస్తూ మెమో జారీ చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో వాట్సాప్



గ్రూప్ తయారు చేసి, ప్రతి నీటి వనరుల పరిస్థితులు ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని అన్నారు. వాటర్ గేజ్ జిల్లాలో ఎక్కడ పెట్టారు వంటి వివరాలను, రాబోయే 3 నెలల పాటు రిపోర్టింగ్ షెడ్యూల్ సిద్దం చేసి సోమవారం నాటికి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రజలకు కమ్యూనికేషన్ చాలా వేగంగా జరగాలని అన్నారు. మున్నేరు నది ఖమ్మం నగరానికి మొదటి, రెండవ, మూడవ ప్రమాద హెచ్చరికలు ఎప్పుడు జారీ చేయాలి, ఏ హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతాలు ముంపుకు గురవుతాయి, ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఎస్.ఓ.పి. సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాంతాలలో వరద విపత్తు నిర్వహణ బాధ్యత అధికంగా రెవెన్యూ వ్యవస్థపై ఉంటుందని, అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న నీటి వనరులను పరిశీలించి తెగిపోకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్.ఇ. ఎం. వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా ఇర్రిగేషన్ అధికారి వెంకట్రాం, ఖమ్మం ఆర్డిఓ జి. నరసింహారావు, ఇర్రిగేషన్ డి.ఇ. లు, ఖమ్మం అర్భన్, రూరల్ తహసిల్దార్ లు సైదులు, రాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ఖర్గే సభ విజయవంతం చేయండి



**మధిర, మహా:** జూలై 4వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఉమ్మనేని రమేష్ మండలంలోని గ్రామ శాఖ అధ్యక్షులకు పిలుపునిచ్చారు. పార్టీ చరిత్రలోనే ఇదొక వినూత్నమైన, విశిష్టమైన కార్యక్రమమని పేర్కొన్న ఉమ్మనేని రమేష్, దేశ స్థాయిలో గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు ప్రత్యక్షంగా సమావేశమవడం ఇదే తొలిసారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణ దిశగా, స్థానిక నాయకులకు ప్రాధాన్యతనిస్తూ పార్టీ తీసుకుంటున్న నూతన ప్రయోగానికి ఇది ప్రతీకగా నిలుస్తుందన్నారు. "ఈ మహాసభలో పాల్గొనడం ప్రతి గ్రామ శాఖ అధ్యక్షుడి బాధ్యత. మల్లికార్జున ఖర్గే గారు ఏఐసీసీకి నాయకత్వం వహిస్తున్న తరుణంలో, గ్రామ స్థాయికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ మళ్లీ మానవ సంబంధాల పునాది మీద ముందుకు సాగుతోంది. మధిర నియోజకవర్గం నుంచి కూడా భారీగా నాయకులు, కార్యకర్తలు హాజరై సభను ఘనవంతం చేయాలి" అని రమేష్ విజ్ఞప్తి చేశారు.

## అశ్వరావుపేటను అందంగా తీర్చిదిద్దండి

**దమ్మపేట జులై 3 మహా :** అశ్వారావుపేట నియోజ వర్గాన్ని అందం గా తీర్చిది ద్దాలని ,ఏదైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే జారె ఆది నారాయణ దృష్టికి తీసు కెళ్ళాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్



శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.మండల పరిదిలో ని గండుగులపల్లి తన స్వగృహంలో గురువారం అధికారులు , ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్ష లో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, చెరువులు,ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న అశ్వారావుపేట ను తెలంగాణ గుమ్మంగా తీర్చి దిద్దాలని తుమ్మల కోరారు. అశ్వారావుపేట,దమ్మపేట తహసీల్దార్లు,విధ్యుత్, ఇరిగేషన్,ఆర్ అండ్ బి,అటవీ, పంచాయతీ రాజ్,పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధ్యక్షులుఆలపాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు,కాసాని నాగ ప్రసాద్,కె వి సత్యనారాయణ, మన్యం అప్పారావు,ఎర్ర వసంతరావు,మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# ఖమ్మం జూనియర్ కళాశాలలకు రూ.2.96 కోట్లు

**ఖమ్మం, మహా:** విద్యారంగానికి పట్టం కట్టే దిశగా ఖమ్మం జిల్లా మరో ముందడుగు వేసింది. జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.2.96 కోట్ల నిధులను ఇంటర్మీడియట్ బోర్డు మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగంపై తగిన మార్గదర్శకాలు రూపొందించేందుకు అధికారులు ఒకేచోట సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ శ్రీజ అధ్యక్షతన జరిగిన ఈ సమన్వయ భేటీ ఖమ్మం విద్యారంగ అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలిచింది. కాలనీల్లోంచి కళాశాలల వరకూ ప్రయాణించే విద్యార్థుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ సేవలు మెరుగుపరిచే అంశంపై కూడా కీలక చర్చ జరిగింది. ఇంటర్మీడియట్ విద్యకు వసతుల కల్పనలో మరింత బలోపేతం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.2.96 కోట్ల నిధులు కేటాయించింది. ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య ఉత్తర్వుల మేరకు ఈ నిధులు విడుదలయ్యాయి. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలోని ఐడిఓసి హాల్, న్యూ కలెక్టరేట్ వేదికగా గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఈ నిధుల వినియోగ విధానం చర్చకు వచ్చింది. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీజ అధ్యక్షతన నిర్వహించిన ఈ భేటీలో వివిధ శాఖల అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ నిధులను ముఖ్యంగా కాలేజీల్లోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు వినియోగించాలని నిర్ణయించారు. వాటర్ సప్లయ్ వ్యవస్థ, విద్యుద్దీపాల మరమ్మతులు, సివిల్ పనులు, టాయిలెట్ ఫెసిలిటీలు, ల్యాబ్ సామగ్రి కొనుగోలు, భవనాల రేకులింపు రంగులు వంటి అంశాలకు నిధులను మంజూరు చేయనున్నట్లు అధికారుల స్పష్టం చేశారు. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఈ పనులను పర్యవేక్షించి నాణ్యతను నిర్ధారించాలన్నది ఈ సమావేశంలో ప్రధాన ఆదేశం. తర శాఖలతో సమన్వయం కోసం పంచాయతీ రాజ్, టిఎస్ఆర్టిసి అధికారుల సమూహం కూడా ఈ భేటీలో పాల్గొంది. విద్యార్థులు కాలేజీలకు సకాలంలో రాగలిగేలా బస్సుల షెడ్యూళ్లను సర్దుబాటు చేయాలని ప్రతిపాదనలు వచ్చాయి. ప్రత్యేకంగా విద్యార్థుల



రవాణాకు చర్యలు తీసుకోవాలన్నది అధికారుల ఆదేశం. తద్వారా విద్యార్థుల హాజరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. ఈ భేటీలో ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవిబాబు, డిప్యూటీ మేనేజర్ రామయ్య, సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల సంస్కృతి సంప్రదాయాల ప్రతీక సీత్లా పండుగ







- పశుసంపద కోసం దేవతల ఆరాధన
- ఒకే రోజున జరుపుకొని జాతీ ఐక్యతను చాటాలి
- గిరిజన బంజారాల సాంప్రదాయం పండుగ (దాటుడు) పూర్వ వైభవం
- ధర్మజాగరణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ మహరాజ్

**టేకులపల్లి - మహా :** ఓగిరిజన బంజారాల సంస్కృతి సాంప్రదాయాల సీత్లా పండుగను పెద్ద పూసాల కార్తె మొదటి మంగళవారం జులై 8న జాతి మొత్తం ఒకే రోజున జరుపుకొని జాతి ఐక్యతను సాటాలని విజ్ఞప్తి చేస్తూ ధర్మ జాగరణ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ మహరాజ్ గిరిజనుల బంజారాల కట్టుబొట్టు వేషధారణలతో సంస్కృతి సంప్రదాయాలను అతి పవిత్రంగా ప్రకృతిని పూజించడం ప్రేమించడం బంజారాల ప్రత్యేకత అలాగే పండుగ సందర్భంగా పశువులను పూజించి ప్రతి సంవత్సరం పెద్ద పూసాల కార్తె మొదటి లేదా రెండో మంగళవారం గిరిజన జాతి శుభ ఒట్టిపడేలా సిత్లా పండుగ జరుపుకోవడం ఆనవైతి ఈ పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు ఒకేసారి జరుపుకోవాలని గత పది సంవత్సరాలుగా బంజారా జాతి పెద్దలు విద్యావంతులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు అయితే గిరిజనులు తాము జరుపుకునే పండుగలు మొదటి పండుగ శీతల పండుగ కావడం విశేషం

పండుగ సారాంశం: పూర్వం గిరిజనులు బంజారా లు ఎక్కువ సంఖ్యలో పశుసంపదలను కలిగి ఉండి వ్యవసాయ జీవన ఆధారంగా జీవించేవారు అందుకే వారు పశువులను ఊరికి పచ్చగా ఉండే దూరప్రాంతాలకు మేకలను గొర్రెలను తీసుకువెళ్లి ఆయా ప్రాంతాలలో గూడెం ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవారు వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల పచ్చగా ఉండాల్సిన ప్రాంతాలు ఒకసారిగా మార్పు సంచరించుకోవడంతో పశువులను వివిధ రోగాలు వచ్చేవి ఇలా రోగాలు బారిన పడిన పశు సంపద రోజురోజుకీ తగ్గిపోవడంతో తండావాసులు తల్లడిల్లిపోతున్న నేపథ్యంలో ఒకరోజు రాత్రి తాండ పెద్ద కు ఏడుగురు దేవతలు కలలోకి వచ్చారు ఆ ఏడుగురి దేవతలలో చిన్నదైనా శిత్లా భవాని ప్రత్యక్షంగా కలలోకి వచ్చి తనను ప్రత్యేకించి పూజించి జంతుబలి చేస్తే రోగాల బారిన పడి చనిపోతున్న పశుసంపదను కాపాడుతానని చెప్పి అదృశ్యమైంది మరునాటి నుండి ఆ తండా పెద్ద తండాలోని ప్రజలందరికీ ఒక దగ్గర కూర్చోబెట్టి తన కలలో వచ్చిన సిత్లా భవాని వచ్చి చెప్పిన విషయాలను ప్రజల వివరించారు ఈ విధంగా బంజారాల బంజారాల పండుగ ప్రాచీనం నుంచి ఆచరణలో వచ్చింది

## సాత్ భవాని (ఏడుగురు దేవతలు) సిత్లా పండుగ

పశువులు రోగాల బారిన పడి చనిపోతున్నప్పుడు పశు సంపదను కాపాడాలని కోరుతూ గిరిజన బంజారా సాత్ భవాని (ఏడుగురు దేవతలు) అయిన"మేరామా, తొల్జా, మంత్రాల్ , కేంకాళి, హింగ్లా, ద్వాల్లాగార్, సిత్లా, భవానీ లను (దేవతలను) పూజించడమే సిత్లా పండుగ

## సిత్లా పండుగ విధానం

పెద్ద పూసల కార్తె మొదటి లేదా రెండవ మంగళవారం జరుపుకునే ఈ పండుగ గిరిజనుల ఇళ్లలో తాండకు సమీపంలో ఓ ప్రత్యేక దేవతల విగ్రహాలను ఏర్పాటు చేస్తారు ఏర్పాట్లు ఏడుగురు దేవత మూర్తుల విగ్రహాలను రాళ్ల రూపంలో వరుసగా క్రమంలో పేర్చి దేవత విగ్రహాలను ఎదురుగా లుంకాడియా విగ్రహాన్ని ఏడుగురు దేవతల వైపు చూసే విధంగా ఏర్పాటు చేస్తారు.

## కన్నెపిల్లలచే దేవతలకు నైవేద్యం

సిత్లా భవాని విగ్రహాలకు జాజిరంగు పూసి మామిడి తోరణాలను దేవత మూర్తుల చుట్టూ కట్టి అలంకరిస్తారు పండుగకు ఒకే రోజు ముందు జొన్నలు పుష్ప ధాన్యాలు నానబెట్టి పండగ రోజు వండుతారు దీనిని గగ్రి అని వాసిడో అని అంటారు వండిన ఆ పదార్థాన్ని ముందుగా పెళ్లి కాని యువతల చేత దేవతలకు నైవేద్యం ప్రసాదం అందించే విధంగా యువతుల చేత అందిస్తారు గిరిజన వేషధారణలో పెద్ద ఎత్తున మేడ తాళాలతో మేకలతో గొర్రె పొట్టేలతో దేవతలకు బలివ్వడం కోసం తీసుకొస్తారు సిత్లా భవానీలకు (దేవతలకు) బంజారా గిరిజనుల ఇంట వండుకొని లాప్సి (పాయసం) నీ పూజలో ఉంచి గొర్రెపోతులపై నీళ్లు పోసి జడిపి ఇస్తారు ఆ గొర్రె పోతులకు భవాని ముందు బలి ఇస్తారు గొర్రె మేకపోతులను బలి ఇచ్చి పొట్టలో పేగులను బయటకు తీసి ఏడుగురు దేవతల భవానీల ప్రతిభ నుంచి లుంకడియా ప్రతిమను వరకు నేలపై పరుస్తారు అనంతరం యువకులు చెంబులతో తెచ్చిన నీళ్లలో ఏడుగురు దేవతల ప్రతిమ తో పాటు లింకుడిగా ప్రతిమ ను జలాభిషేకం చేస్తారు ఇలా గిరిజన బంజరుల సాంప్రదాయ పండుగ దాటుడును ఘనంగా చేసి వారి సాంప్రదాయాలను విశ్వాసాలను మెరుగుపరుస్తారు

# గుడిసెల్లో ఉండేవారికి తక్షణమే ఇండ్లు

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి తుమ్మల

**ఖమ్మం, మహా:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం" అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించేందుకు అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం మంత్రి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్.సి.పి నిధుల కింద రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లను తొలి విడతగా గుడిసెల్లో జీవించే నిజమైన పేదలకు మాత్రమే కేటాయించామన్నారు. ఎవరైనా ఇంకా గుడిసెలో నివాసం ఉంటే, వారు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయా కుటుంబాల ఫోటోలు తీసుకొచ్చి ప్రతిపాదనలు పంపితే, తక్షణమే ఇండ్ల మంజూరు చేపడతామని హామీ ఇచ్చారు.



ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు మరింత సమర్ధంగా అమలయ్యేందుకు స్థానిక అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా స్పందించాలంటూ మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. తాను స్వయంగా గ్రామ పర్యటన చేసి పేదల స్థితిగతులను గమనించానని, వారి అవసరాలకు తగిన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, మండల తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# నీటి వివాదాలతో ప్రజల్లో విద్వేషాలు పెంచే కుట్రలు

**ఖమ్మం సిటీ, మహా:** తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా ప్రజల్లో చిచ్చు పెట్టాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా ఫందా) ఆరోపించింది. ప్రస్తుతం బనకచర్ల-పోలవరం అనుసంధాన ప్రాజెక్టును కారణంగా చూపిస్తూ తప్పుడు వివాదాలు పెంచి, ప్రజల దృష్టిని తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపింది. ఇలాంటి అంశాలను రాజకీయం చేయకుండా, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, కృష్ణా-గోదావరి నదులపై నికర జలాల పంపిణీ శాస్త్రీయంగా జరగాలన్నారు. బచావత్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అవసరాలను బట్టి నీటి పంపిణీ జరగాలన్నారు. కేంద్ర జలసంఘం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో సమన్వయం సాధించి పరిష్కారం చూపాలన్నారు. నీటి రాజకీయాలతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని, రాజకీయ పార్టీల దురుద్దేశాలను ప్రజలు అర్థం చేసుకోవాలని మాస్ లైన్ నేతలు కోరారు. ఇక జూలై 9న దేశవ్యాప్తంగా జరగనున్న బంద్‌కు మద్దతు ప్రకటించిన మాస్ లైన్ పార్టీ - కనీస వేతనం రూ.26,000, నాలుగు లేబర్ కోడ్ల రద్దు, ప్రభుత్వరంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేసింది. కార్మికులు, రైతులు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి. రంగారావు, జిల్లా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, కె. శ్రీను పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం మనందరి బాధ్యత

**కూసుమంచి, జులై 3, మహా:** ప్లాస్టిక్ రహిత సమాజం మనందరి బాధ్యత అని నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం కోరారు. ప్రపంచ పర్యావరణంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలను చైతన్య పరిచేందుకు ఖమ్మం-సూర్యాపేట నేషనల్ హైవే అథారిటీ అవగాహన సదస్సును నిర్వహిస్తోంది. అందులో భాగంగా గురువారం నాయకనగూడెం ఉన్నత పాఠశాల, గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ను నిషేధించాలని కోరారు. అలాగే రీసైక్లింగ్ చేయగలిగే వాటిని మాత్రమే ఉపయోగించాలని ప్లాస్టిక్ రైత సమాజాన్ని రూపొందించాలంటే మనందరు బాధ్యత ప్లాస్టిక్ ను నిషేధించాలని కోరారు. అనంతరం స్కూలు విద్యార్థులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్సిడెంట్ మేనేజర్ కొండల రావు, హైవే సిబ్బంది, గ్రామ ప్రజలు %డ%స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



# చట్టాల ప్రయోగంలో తారతమ్యం?

**మధిర, మహా:** మధిర మండలంలోని తొండలగోపవరం గ్రామంలో చట్టాలను సార్వత్రికంగా కాకుండా, రాజకీయ పక్షపాతంతో వర్తింపజేస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు మధిరలో ఆందోళన చేపట్టారు. గ్రామపంచాయతీ పరిధిలోని తొర్లపాడు గ్రామంలో రహదారి పక్కన నిర్మించిన ఇంటిని తొలగించాలంటూ ఆర్ అండ్ బి శాఖ నుంచి వచ్చిన ఆదేశాలపై స్పందించిన గ్రామ అధికారులు నోటీసులు జారీ చేయగా, ఆ నోటీసు కేవలం ఒకరికి మాత్రమే ఇవ్వడం చర్చనీయాంశమైంది. సిపిఎం పార్టీ కార్యకర్త మద్దాల ఏబు తండ్రి పద్మారావు ఇంటిపై మాత్రమే చర్యలు తీసుకొని, అదే ప్రాంతంలో రహదారి పక్కన నిర్మించిన అధికార పార్టీ నాయకుల ఇళ్లపై మౌనం పాటించడం పట్ల గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. ఈ తారతమ్యానికి నిరసనగా మధిర ఎంఇఓ కార్యాలయం, ఆర్ అండ్ బి కార్యాలయాల ఎదుట గ్రామస్తులు, సిపిఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్ రావు




మాట్లాడుతూ, ఇది స్పష్టమైన రాజకీయ కక్షసాధింపు చర్య అని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ నాయకులు గౌరవ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేరు వాడుకుంటూ ప్రత్యర్థులను వేధించేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని విమర్శించారు. అయితే, భట్టి విక్రమార్క నుంచి ఇలాంటి చర్యలకు ప్రోత్సాహం ఉంటుందని భావించడం తప్పుడు విషయమని స్పష్టం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిడులకు లోనవకుండా, సమాన న్యాయంతో వ్యవహరించాలని సూచించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం మధిర మండల కార్యదర్శి మందా సైదులు, జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, డివిజన్ నాయకులు పాపినేని రామనరసయ్య, ఎర్రుపాలెం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మధిర పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, నాయుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

05
FOLLOW: @ANNTELUGU
4-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి!

## ఖమ్మంలో మంత్రి కార్యాలయాల ముట్టడి





**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మంలో విద్యార్థి సమస్యలు మరింత ముదిరిపోతున్న నేపథ్యంలో పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా, విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయనే ఆవేదనతో ఈ ఆందోళనకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఖమ్మం నగరంలోని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల కార్యాలయాలను విద్యార్థులు ముట్టడించగా, పోలీసులు వెంటనే స్పందించి పీడీఎస్‌యూ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులను విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. పీఆర్ఎఫ్ (ఫీజు రీయింబర్స్‌మెంట్), స్కాలర్‌షిప్, బెస్ట్ అవైలబుల్ ఫండ్ లు లాంటివి విద్యార్థుల జీవనాధారాలు కావాలని, వాటిని కొనసాగించకపోతే లక్షలాది మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించలేని పరిస్థితులు నెలకొంటాయని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం ఎమ్మెల్యేలకు మాత్రం నెలకోసారి జీతాలు ఇవ్వడం ఎంత దారుణమో ఆలోచించాలన్నారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి ఎదురుదెబ్బ కొట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన ఎనిమిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రెండు వందల కోట్ల బెస్ట్ అవైలబుల్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం కావాలని అవి ఇవ్వక ప్రైవేట్ కళాశాలల ఒత్తిడికి విద్యార్థులను బలిగా మార్చుతోందని ఆరోపించారు. ఈ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని, చెల్లింపులు చేయకపోతే మిగిలిన విద్యను నిలిపివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత బస్ పాస్ వంటి వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆర్థిక బాదరబ్బందుల పట్ల ప్రభుత్వం కనీస చిత్తశుద్ధి కనబరచకపోవడం ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వం నిబంధనలను తుంచిపెట్టి, జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వకపోగా, సామాన్య ప్రజల వద్ద అధిక మొత్తంలో డొనేషన్లు వసూలు చేస్తూ విద్యా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఇది విద్యను కమర్షియల్ చేసే ప్రయత్నమేనని, విద్యా ప్రమాణాలపై సున్నితంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన నిధులను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను భవిష్యత్తు కోల్పోకుండా కాపాడాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు వినయ్, కార్తీక్, పృథ్వి, సురేష్, నసీర్, చందు, అశోక్, ప్రసాద్, పేర్ల వెంకటేష్, నరేంద్ర, వరుణ్, సంతోష్, అఖిల్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రిని కలిసిన చేబోలు దంపతులు



**బోనకల్ మహా:** బోనకల్ మరియు రావినూతల గ్రామ పలు సమస్యలపై విక్రమార్క గారికి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా బోనకల్ మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి కొరకై వినతిపత్రం అందజేశారు రెండవది గా రావినూతల ఎస్సీ కాలనీ స్మశాన వాటిక చుట్టూ కాంపౌండ్ వాల్ మరియు ఆర్చి, స్నానపు గదులు,త్వరితగతిన నిర్మాణం కోరుతూ వినతిపత్రం సమర్పించారుబి .ఈ ఉదయం ముందుగా నిమ్స్ లో చికిత్స పొందుతున్న తాళ్లూరి శ్యాంబాబు ప్రేమానందం ను పరామర్శించి వారి తల్లిదండ్రులను ఓదార్చారు. అక్కడే చికిత్స పొందుతున్న తాళ్లూరి వెంకటి బలరాం ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





## భాధ్యతలు స్వీకరించిన టాస్క్ ఫోర్స్ ఏసిపి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్

**ఖమ్మం, మహా:** టాస్క్ ఫోర్స్ ఏసిపి గా సత్యనారాయణ,ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా ఇన్స్పెక్టర్ చిట్టిబాబు భాధ్యతలు స్వీకరించారు.అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గారిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు.

## అక్కా నీ బిడ్డ ఆరోగ్య బాధ్యత నాది...!



**కూసుమంచి, మహా:** మంచం మీద అచేతన స్థితిలో ఉన్న పరశురాం కూతురు సింధు ఆరోగ్య పరిస్థితి గురించి సింధు తల్లి లలితను అడిగి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలుసుకున్నారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ధర్మతండాలో ఇటీవల మృతి చెందిన పరుశరామ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పరశురాం కుమార్తె ఆరోగ్య పరిస్థితిని అతని భార్య లలితను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ముందు లలిత కన్నీటి పర్యాంతమై తన బాధను చెప్పుకున్నారు. వెంటనే మంత్రి పొంగులేటి స్పందించి ఎంపీ రఘురాం రెడ్డి, తాను కలిసి స్వయంగా హైదరాబాద్ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ల తో మాట్లాడి వైద్యం చేపిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎం రిలీఫ్ పండ్ బిల్లులన్ని మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడకు అక్కా నేను అండగా ఉంటానని చూసుకుంటనని హామీ ఇచ్చారు.

## ఖర్గే సభను ఘన విజయం చేయాలి

**వైరా, మహా:** వైరా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జూలై 3న నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వేడుకగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లు హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే గారు ముఖ్య అతిథిగా పాల్గొననున్న బహిరంగ సభను ప్రతి గ్రామ స్థాయి నేత విజయవంతం చేయాలి," అని కోరారు. గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ఈ సభ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. పార్టీని నాడితో కలిపే గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలతో నేతలు నేరుగా ముఖాముఖి కలిసేందుకు ఈ సభ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కాంగ్రెస్ కార్యాచరణలో తాజా మార్గదర్శకాలను పునర్నిర్మించేందుకు, కార్యకర్తల ఉత్సాహాన్ని పెంచేందుకు ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా, కార్యకర్తలు అందరూ గ్రామాలలో చురుకుగా పాల్గొని ఖర్గే సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీకి ఈ సమయం కీలకమైనదని, కార్యకర్తల స్ఫూర్తి, నాయకత్వం విజయానికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు.



## పత్తి పంటలు, ఆయిల్‌ఫామ్ సాగుపై అధ్యయనం

రఘునాథపాలెం, మహా: రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో ఈరోజు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కలిగిన పలు క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య పరిశీలించారు. స్థానికంగా సాగుచేసే పత్తి, పెసర పంటలతో పాటు ఆయిల్ ఫామ్ సాగు పద్ధతులపై రైతులకు వినూత్న సూచనలు అందించారు. వేపకుంట్ల గ్రామ రైతులు ఆయిల్‌ఫామ్‌లో అంతర పంటగా పత్తిని సాగుచేస్తున్న పద్ధతులను అధ్యయనం చేసిన జిల్లా అధికారి, ఈ మల్టీక్రాప్ విధానాన్ని ఇతరులు కూడా అనుసరించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను ప్రధానంగా తీసుకోవాలని, దీని ద్వారా సాధ్యమయ్యే నికర ఆదాయం ఇతర పంటల కంటే మెరుగ్గా ఉంటుందని వివరించారు. ఆయిల్‌ఫామ్ పంటలు మొదటి మూడు సంవత్సరాలు పూర్తిగా లాభదాయకంగా మారకపోయినా, అంతర పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుందన్నారు.



## సేంద్రియాన్ని పెంపొందించండి

రఘునాథపాలెం, మహా: రఘునాథపాలెం మండలం హరియాతండా గ్రామపంచాయతీలో ఈరోజు రైతులలో నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ – రైతులు పత్తి, మిర్చి, వరి, కూరగాయల వంటి పంటలను సాగు చేస్తున్నప్పుడు భూమిలో సేంద్రీయ కర్బనాన్ని పెంపొందించుకుంటేనే భూమి దీర్ఘకాలికంగా సారవంతంగా ఉండగలదని, అందువల్ల సేంద్రీయ పదార్థాల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రైతులు సేంద్రియతత్వాన్ని పక్కనపెట్టి అధికంగా యూరియా, డి.ఏ.పీ వంటి రసాయన ఎరువులను వాడితే భూమి చౌడువారి ప్రమాదం ఉందని హెచ్చరించారు.



## స్త్రీలకు ఉచిత గర్భకోశ వ్యాధుల పరీక్షల శిబిరం ఎంతో అవసరం

మహా భద్రాచలం: భద్రాచలం శ్రీ జీయర్ మఠం నందు వికాస తరంగణి,లైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీలకు ఉచిత గర్భకోశ వ్యాధుల పరీక్షల శిబిరం మహిళలకు ఎంతో ప్రయోజనం అని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ, స్వచ్చంద సేవా సంస్థలను కొనియాడారు. స్త్రీలు పరీక్షలు చేపించుకోవడం కారణంగా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించవచ్చని పేర్కొన్నారు.మహిళా ఆరోగ్య వికాస్ అందిస్తున్న సేవలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమల కుమారి,మహిళాఆరోగ్య వికాస్ సమన్వయకర్త మాధవి రవీంద్ర,డాక్టర్ జయభారతి, చారుగుళ్ల శ్రీనివాస్,నాగేశ్వరావు, కురుచేటి శ్రీనివాస్,వనజా మణి,లలిత తదితరులు పాల్గొన్నారు.



## రామయ్య సేవలో ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ డిడి

మహా భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని సెంట్రల్ గవర్నమెంట్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ సింగ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# ఖమ్మం నగరానికి ధీటుగా కూసుమంచి హెడ్ క్వార్టర్ అభివృద్ధి

**తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



కూసుమంచి, మహా: నగరాలకు ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం కూసుమంచిలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు.ధర్మతండా గ్రామంలో 36 లక్షలతో కూసుమంచి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ధర్మతండా వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనులకు, లోక్యాతండా గ్రామంలో ఒక కోటి 26 లక్షలతో లోక్యాతండా నుండి ధర్మతండా వరకు, ఒక కోటి 16 లక్షలతో లోక్యాతండా నుండి అగ్రహారం వరకు చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు, కోక్యాతండా గ్రామంలో 2 కోట్ల 90 లక్షలతో కోక్యాతండా నుండి వీర్యాతండా వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గన్యాతండా గ్రామంలో 3 కోట్ల 30 లక్షలతో గన్యా తండా నుండి మోటాపురం వీరన్న స్వామి టెంపుల్ వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కూసుమంచి గ్రామంలో 6 కోట్ల 50 లక్షలతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులకు, ఖమ్మం – కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి రోడ్డులో ఏర్పాటు చేయు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కోక్యా తండాలో నిర్మాణంలో ఉన్న బాణోత్ సురేష్, భూమిక ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ప్రభుత్వం నుండి ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు, నిర్మాణం పూర్తి అయిన వాటికి దశల వారిగా ప్రతి సోమవారం విడతలుగా నేరుగా లబ్దిదారుని ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ… కూసుమంచి, నేలకొండపల్లి మండల హెడ్ క్వార్టర్ లలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, జంక్షన్ అభివృద్ధి పనులు కొద్ది నెలల్లో పూర్తి చేస్తామని, ఖమ్మం నగరానికి ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను తయారు చేస్తామని అన్నారు. కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంతర్గత రోడ్లు నిర్మించామని, త్రాగునీటి సరఫరా సమస్యలు పరిష్కరించామని, 50 లక్షల రూపాయలతో షాదీ ఖానా మంజూరు చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో మంజూరు చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. గత 18 నెలల కాలంలో ధర్మతండా గ్రామంలో 22 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, 20 లక్షల రూపాయలతో గిరిజన శాఖ ద్వారా పలు అభివృద్ధి పనులు, లోక్యతండా గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, 12 లక్షలతో అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధి, 4 లక్షల రూపాయలతో త్రాగు నీటి సరఫరా పనులు, కొక్యా తండా లో 14 లక్షలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు, 12.35 లక్షలతో అంగన్వాడీ భవనం, 10 లక్షలు ఖర్చు పెట్టి మంచినీటి సమస్య తీర్చుకున్నామని అన్నారు. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత 18 నెలల కాలంలో సుమారు 1400 నుంచి 1500 కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ప్రజల దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడినందున ఇంత అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.గత పాలకులు అమలు చేసిన సంక్షేమం కొనసాగిస్తూ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు లబ్దిదారులకు సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జిలు 200 శాతం పెంచామని, రైతులకు 21 వేల కోట్ల రూపాయలతో 2 లక్షల రుణ మాఫీ చేశామని అన్నారు. గత ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల రూపాయలు అందిస్తే, ప్రజా ప్రభుత్వం రైతులకు అందించే సహాయం 12 వేలకు పెంచి, 9 రోజుల వ్యవధిలో దాదాపు 9 వేల కోట్ల రూపాయ లను రైతు భరోసా నిధులు జమ చేసామని అన్నారు. ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తుందని అన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో మరో 3 విడతల్లో అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ …. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకు గ్యాస్ సిలెండర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా అందిస్తున్నదని అన్నారు. అర్హులైన పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఇఇ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, విద్యుత్ శాఖ ఏడిఇ లోక్యా నాయక్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు పంపిణీతో సంక్షేమానికి నాంది

## ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ చేతుల మీదుగా పట్టాలు అందజేత



**వైరా, మహా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో గృహ స్వప్నాన్ని నెరవేర్చే వేళగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-% "తెలంగాణ రాష్ట్రంలో ఎవ్వరూ ఇల్లు లేకుండా ఉండకూడదు అనే ధ్యేయంతో ఇందిరమ్మ పథకం పునఃప్రారంభమైంది. పేదల గృహ కలను సాకారం చేసేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. ఖమ్మం జిల్లాలో అధిక సంఖ్యలో అర్హులైన పేదలను గుర్తించి వారికి స్థలాలు, ఇండ్లు కేటాయించాం," అని తెలిపారు. అలాగే, "ఇప్పటి వరకూ అప్పుల ఊబిలో ముంచి పెట్టిన గత ప్రభుత్వ పాలనను తిప్పికొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది. కేసీఆర్ పాలనలో రాజధాని బయట ఫామ్ హౌస్‌లలో నిద్రపోయే పాలకులు ఉన్నారు. కాని నేడు ప్రజల ఇంటి ముందు నిలబడే పాలకులు ఉన్నారు," అని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తూ, "బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సంక్షేమ పథకాలపై బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నాయి. అయినప్పటికీ, అర్హులందరికీ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుండబోతుంది" అన్నారు. కార్యక్రమంలో పలు ప్రముఖులు పాల్గొన్నారు. వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకట నర్సిరెడ్డి, మాజీ మార్కెట్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, జిల్లా నాయకులు పొదిల హరినాథ్, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, బిడికే రత్నం, శ్రీరామనేని తిరుపతిరావు, దర్నా రాజశేఖర్, గరిడేపల్లి కిషోర్, కొప్పురావూరి శబరినాథ్, కర్నాటి హనుమంతరావు, తెళ్ళూరి వీరయ్య తదితరులు ఉన్నారు.

## యూరియా స్థానిక రైతులకే విక్రయించాలి



**నేలకొండపల్లి, జులై 3 మహా :** యూరియా ను స్థానిక రైతులకే విక్రయించాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో డీలర్లు తో గురువారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... ఎరువుల ను అధిక ధరలకు విక్రయించటం, ఇరత ప్రాంతాల వారికి విక్రయించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయాల పై రిజిష్టర్లు లో తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పైనంపల్లి గ్రామంలో నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా వలన రైతులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. భూమి ని కాపాడుకోవచ్చునని అన్నారు. నానో పద్దతి ద్వారా పిచికారి చేస్తే అనేక ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. నానో యూరియా పై గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు. రామలక్ష్మడు, సీఈవో లు ఖమ్మం వెంకటేశ్వర్లు, జగదీష్, నాగేశ్వరరావు, రైతు ప్రతినిధులు వేనేపల్లి నాగేశ్వరరావు. భాస్కర్ రెడ్డి, వై.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు చేపట్టాలి



**నేలకొండపల్లి, జూలై 13 మహా:** ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. వెంగళరావు డిమాండ్ చేశారు. మండలం లోని వివిధ గ్రామాల పాఠశాలలో గురువారం సంఘం సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఖాళీలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మరియు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్స్ ను ప్రభుత్వం చేపట్టాలని కోరారు. ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ను స్థాపించి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నంను ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు భాగ్యలక్ష్మి, జ్యోతి, మండల అధ్యక్షుడు పి.గోవిందరావు, బీ.రామారావు, అనిల్, చీనా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారం గ్రామ ప్రజల కష్టాలు ఎప్పుడో?

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలంలోని కిష్టారం గ్రామ ప్రజల మొర్రేడు వాగుకు అవతల వ్యవసాయ పంట పొలాలు ఉండడంతో వాగు దాటాల్సిన పరిస్థితి వ్యక్తులు గ్రామాల్లో చనిపోతే వాగుకు అవతల ఒడ్డున వైకుంఠధామం ఉండడంతో కర్మకాండలకు చేయాలంటే వాగు దాటాల్సిన పరిస్థితులు ఈ కష్టాలు దశాబ్దాలుగా కిష్టారం చుట్టుపక్కల గ్రామ ప్రజలకు తప్పడం లేదు వంతెన నిర్మించి వంతెన అవతల సుమారు వేల ఎకరాల భూములు ముర్రేడు వాగు అవతల ఉన్నాయి పనులకు వచ్చి పోయేటప్పుడు వాగు దాటాల్సిన పరిస్థితులు గ్రామ రైతులకు తీవ్ర కష్టానికి ముర్రేడు వాగు దాటి వ్యవసాయం పనులకు వెళ్లలేక తీవ్ర ఆస్తులు పడుతున్న ప్రజలు రైతులు వీరంతా రెక్కాడితే డొక్కాడని రైతులు వీరి బాధలను ప్రజాప్రతినిధులు సంబంధిత స్పందించి ఈ సమస్యకు పరిష్కారం మార్గం చూపెట్టాలి మహాప్రభువు అని వేడుకొనే పరిస్థితులు ప్రజల వంతు అవుతుంది దీనిని ఎన్నడూ సాలు చేస్తారు అని ప్రజలు వాబోతున్నారు

## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే బియ్యం వితరణ

**కారేపల్లి, మహా :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉసిరికాయలపల్లి సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి అమీర్ కుటుంబానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఒక క్వింటా బియ్యంను వితరణ చేశారు. సంస్మరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే అందించిన బియ్యం ను కాంగ్రెస్ నాయకులు అమీర్ కుటుంబానికి గురువారం అందజేశారు. ఎమ్మెల్యే ఫోన్‌లో అమీర్ కుటుంబాన్ని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సత్తుపల్లికి నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్



**సత్తుపల్లి, జూలై 3: మహా:** సాధారణ బదిలీలలో భాగంగా సత్తుపల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.కిరణ్ స్థానంలో ఖమ్మం మహిళ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తించిన టి. శ్రీహరి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తన నివాసం గనుగులపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## ఇందిరమ్మ ఇల్లు నమూనా పరిశీలన



**చింతకాని, మహా:** చింతకాని మండల కేం ద్రంలో తహసీల్దార్ కార్యాలయం లో నిర్మించిన ఇంది రమ్మ ఇల్లును పరిశీలిం చి, మండలంలోని ఇందిర మ్మ ఇల్లు లబ్ధిదారులు ఈ విధంగా నిర్మించుకోవాలని ప్రజా ప్రభుత్వ పాలనలో ఇందిరమ్మ ఇల్లులు ప్రతి ఒక్కరికి అందుతాయని అంబటి తెలిపారు.

## 5న కార్యకర్తలకు రాజకీయ తరగతులు



**కారేపల్లి, మహా :** సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 5,6 తేదిలలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యదర్శి కే.నరేంద్ర తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహన, ప్రపంచ, దేశ రాజకీయ పరిస్థితులు తెల్పటానికి గాంధీనగర్‌లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై తరగతులు బోధించటం జరుగుతుందన్నారు. రాజకీయ, సైద్ధాంతిక అవగాహన ఉండటం వలన బూర్జువ పార్టీలు అవలంభిస్తున్న విధానాలను ఎత్తిచూపవచ్చన్నారు. ఈ తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణంపై

# అర్ధనగ్న ప్రదర్శన

### సంఘీభావం తెలిపిన ఆదివాసి నాయకుడు సోయం





**దమ్మపేట ,జూలై 3 మహా :** బస్టాండ్ లో పెట్రోలు బంక్ నిర్మాణ పనులను నిలిపివేయాలని నిరసిస్తూ బస్టాండ్ సాధన కార్యాచరణ కమిటీ యువకులు గురువారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు.మండల కేంద్రం లో బస్టాండ్ లేక ప్రయాణీకులు అవస్థలు పడుతున్న సమయంలో ఆనాటి సర్పంచ్ దివంగత కక్కిరాల ధర్మలింగేశ్వరరావు కృషి చేశారు. నాడు లక్షల రూపాయల విలువైన పట్టాభూమిని దాతలనుండి ప్రయాణీకుల అవసరార్ధం ఉచితంగా సేకరించారు. అట్టి బస్ స్టాండును నాటి సత్తపల్లి శాసన సభ్యులు జలగం ప్రసాదరావు ఏప్రిల్ 5 ,1994 లో ప్రారంభించారు. నాడు సత్తుపల్లి నుండి అశ్వారావుపేట వైపు వెళ్ళే పల్లెవెలుగుల నుండి ఎక్స్ప్రెస్ ల వరకు అన్ని బస్ లు వస్తూ ,వెళుతూ ఉండేవి.కాలక్రమంలో బస్టాండ్ పై ఎవరూ ఆసక్తిని పెంచుకోకపోవడంతో మరుగున పడి ,బిక్షగాళ్ళకు నిలయంగా మారింది. దానిని గత కొంతకాలం క్రితం మేముసైతం ఫౌండేషన్ యువకులు స్వచ్ఛందంగా శుభ్రపరిచి ప్రయాణీకులకు ఉపయోగపడే విదంగా రూపుదిద్దారు. ఆ తర్వాత ప్రధాన పత్రికలలో బస్ స్టాండ్ పై అనేక వార్తలను ప్రచురించడంతో మరలా కొంతకాలం బస్ లు వస్తూండేవి. అటు తర్వాత స్థానిక శాసన సభ్యులు జారె ఆదినారాయణ స్వయంగా జెసిబీలతో శుభ్రపరిచారు. ప్రయాణీకులకు అవసరమైన బస్టాండ్ ను పెట్రోలు బంక్ గా మార్చడానికి గల కారణాలేమిటి...? ఇందుకు సహకరించేందుకు ఎవరు ప్రయత్నిస్తున్నారనే అంశాలు వెలుగులోకి రావారని స్థానిక యువత ప్రశ్నిస్తుంది.

### సంఘీభావం ప్రకటించిన ఆదివాసి నాయకులు సోయం వీరభద్రం

ప్రజలు చేపట్టే ప్రజాహిత కార్యక్రమంలో తాను ఎల్లప్పుడూ ముందుగా ఉంటానని ,ప్రజలకు అవసరమైన బస్టాండ్ లో పెట్రోలు బంక్ నిర్మించడం సరైన కార్యక్రమం కాదని ఆదివాసి రాష్ట్ర నాయకులు సోయం వీరభద్రం అన్నారు. నిరసన చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. వీరితో పాటుగా ఆదివాసి నాయకులు ఆరెం ప్రశాంత్ , వాడే వీరస్వామి తదితరులు ఉన్నారు.

### మౌన ర్యాలి, పట్టణ బంద్‌కు పిలుపు

బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి ,మౌనంగా ర్యాలీ చేయనున్నట్లు కార్యాచరణ కమిటీ తెలిపింది. స్థానిక బస్టాండ్ నుండి తహాశీల్దార్ కార్యాలయం వరకు నిరసనగా వెళ్ళి వినతి పత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా శనివారం దమ్మపేట పట్టణ బంద్ కు పిలుపు నివ్వనున్నట్లు తెలిపారు. ప్రజాహిత కార్యక్రమంలో స్వచ్చందంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# భూ మాఫియాకు చెక్!



**ఖమ్మం అర్బన్, మహా:** ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగు గ్రామంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదిపేసిన ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. నకిలీ హక్కుల పేరుతో వేల కోట్ల విలువైన భూములు కొన్ని వ్యక్తుల కబ్జాలోకి వెళ్లిన నేపథ్యంలో, అధికారులు సమయోచితంగా స్పందించి మళ్లీ ప్రభుత్వ హక్కును సాధించగలగడం అనేది అభినందనీయం. 50 కోట్ల విలువ కలిగిన 9 ఎకరాలు 9 గుంటల భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడం వలన ఖమ్మం పట్టణ పరిధిలో భూ మాఫియాకు గట్టి దెబ్బ పడ్డట్లైంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ చర్య సాగింది. ఖమ్మం జిల్లా అభివృద్ధి వేగం పుంజుకుంటున్న వేళ, ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూకబ్జాలు ఊహించని స్థాయికి చేరాయి. అయితే, అధికారులు ఈసారి అప్రమత్తమయ్యారు. మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 196/2 మరియు 196/1లో ఉన్న భూమిపై వివాదం తలెత్తినప్పటికీ, ధృవ పత్రాలు పరిశీలించిన అనంతరం అధికారులు మునిగిన భూమిని వెలికితీశారు. ఇక్కడి భూమిని బాణోత్ సక్కుబాయి, చుక్కమ్మ లకు అప్పట్లో కేటాయించినట్లు నమోదులు ఉన్నా... తరువాతి రోజుల్లో ఈ భూములు పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తాకినట్లు గుర్తించారు. వాస్తవానికి ఈ భూములు భూముల పంపిణీ కింద ప్రభుత్వ నిర్వహణలో ఉన్నవే. రెవిన్యూ శాఖ ఆధీనంలో ఉన్న ఈ భూముల విలువ ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం రూ. 50 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

### స్వాధీన చర్యలు ఎలా జరిగాయి?

వివరాల్లోకి వెళితే... జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ, మున్సిపల్ మరియు పోలీస్ శాఖల సమన్వయంతో పెద్ద ఎత్తున స్థలాన్ని గుర్తించి అక్కడ ఉన్న ఆస్తులను పూర్తిగా గృహంగా గుర్తించకుండా పరిరక్షణ చర్యలు ప్రారంభించారు. అధికార బృందం ఘటనా స్థలానికి చేరుకుని ప్రభుత్వ రికార్డులను ప్రదర్శించి మౌఖికంగా, ఆపై లిఖితంగా ముళ్ళకంచెతో ప్రహరీలు ఏర్పాటు చేసి భూమిని తమ అధికార పరిధిలోకి తీసుకున్నారు.

### ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల మద్దతు..

స్థానికులు ఈ చర్యకు స్వాగతం పలికారు. "ఎంతకాలంగా ఈ భూముల చుట్టూ రియల్ ఎస్టేట్ ముఠాల చక్రం తిరుగుతుంది. చివరికి అధికారులు న్యాయం చేసి ప్రభుత్వానికి తిరిగి అప్పగించారంటే భవిష్యత్తు తరం కొరకు మంచి సంచిక ఇది" అని స్థానిక పెద్దలు వ్యాఖ్యానించారు.

### ఈ భూములపై భవిష్యత్తు ప్రణాళికలు

స్వాధీనమైన భూములను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా సామాజిక సంక్షేమ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, అవసరమైన నివాస యోజనల అభివృద్ధి వంటి అంశాలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.ఈ చర్య ప్రభుత్వ భూములను ఆక్రమించే వారందరికీ గట్టి హెచ్చరికగా నిలిచింది. ఖమ్మం జిల్లాలో భూకబ్జాలపై సున్నితంగా స్పందించడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఈ చర్య ద్వారా మరోసారి స్పష్టమవుతోంది.

# చేయూత పెన్షన్లపై శిక్షణ కార్యక్రమం




**ఖమ్మం, మహా:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "చేయూత" పెన్షన్ పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయడంలో భాగంగా, ఖమ్మం జిల్లాలో శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, సెర్ప్ సీఈఓ ఆదేశాలపై భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ అవగాహన సదస్సులో జిల్లా మున్సిపల్ కమిషనర్లు, మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, డి.ఆర్.డి.ఏ చేయూత విభాగ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానంగా పథకం అమలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, కీలక మార్గదర్శకాలు, లబ్ధిదారుల వివరాల అప్‌డేట్లు, మరియు బ్యాంకు ఖాతాల అనుసంధానం వంటి అంశాలపై పూర్తి వివరాలు అందించబడ్డాయి. సెర్ప్ డైరెక్టర్ శ్రీ గోపాలరావు ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యవక్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి డి.ఆర్.డి.ఓ , అదనపు డి.ఆర్.డి.ఓ , డిపి.ఓ , డిప్యూటీ సీఈఓ జెడ్పీపీ , సెర్ప్ ఎస్.పి.యం పాల్గొని, సిబ్బందికి ప్రోత్సాహం అందించారు. వారి పర్యవేక్షణలో అవగాహన కల్పించడమే కాకుండా, ఫీల్డ్‌లో అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా మార్గదర్శకాలు ఇవ్వడం జరిగింది. అంతటితోనే కాకుండా, అన్ని మండలాల నుండి వచ్చిన సిబ్బంది తమ అనుభవాలను పంచుకోవడంతో, ఒక వేదికపై సమస్యలు, పరిష్కారాలు చర్చించబడే మంచి అవకాశం లభించింది. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు ఎలాంటి సంకోచం లేకుండా సాంకేతిక అంశాలపై అవగాహన పెంపొందించుకొని, లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా ముందడుగు వేశారు.